నడిచిన నేల మీది మట్టి ప్రభావం వల్ల త్వరలోనే అతనికి కృష్ణుడి నగల మీద గల ప్రేమ కృష్ణుడి మీదకి మళ్ళింది.

తను దొంగిలించిన నగలని అతను కృష్ణుడి దేవాలయానికి ఇచ్చేసి, దొంగతనాలు మానేసి కృష్ణ భజనల్లో పాల్గొంటూ భక్తి పారవశ్యం పొందసాగాడు. ఓ రోజు అతనికి ఎదురు పడ్డ ఓ కృష్ణ భక్తురాలు అతన్ని తేరిపార చూసి సంతృప్తి పడింది. అతను తన నగలని దొంగిలించి చెట్టెక్కి దాక్కున్నాడని గ్రహించి, ఆ నాడు కృష్ణుడి నగలు విలువైనవని చెప్పినామె ఆవిడ!

## 166. దొంగ - సన్న్యాసి

ఓ ధనవంతుడి ఇంట్లో దొంగతనం చేసి పారిపోతున్న ఓ దొంగ తనని తరిమే మూక నించి తప్పించుకోడానికి దారిలో అటూ ఇటూ చూసాడు.

దారిలో నిద్రపోతున్న ఓ సన్న్యాసి దుస్తులు దొంగిలించి, ఒంటికి విభూది రాసుకుని ఆ బట్టలు ధరించాడు. అతన్ని చూసి అంతా నిజమైన సన్న్యాసి అని భావించి పళ్ళు, ఫలాలు ఇచ్చి కాళ్ళకి మొక్కి వెళ్ళారు.

'ఒట్టి వేషానికే సన్న్యాసికి ఇంత గౌరవం లభిస్తే, నిజమైన సన్న్యాసినైతే ఇంకా ఎంత గౌరవం లభిస్తుంది?' అనుకున్నాడా దొంగ.

దాంతో ఆ దొంగ సన్న్యసించి పారమార్థిక జీవితం గడపసాగాడు.

## 167. దేవుడు ఎక్కడుంటాడు?

ఓ ఆరేళ్ళ పిల్ల ఓ హరికథా కాలక్షేపానికి వెళ్ళింది. ఇంటికి తిరిగి వచ్చాక ఆ పాపని తాతయ్య అడిగాడు.

"దేవుడు ఎక్కడున్నాడో చెప్తే నీకో రూపాయి ఇస్తాను."

"తాతయ్య. దేవుడు ఎక్కడ లేడో చెప్తే నేను నీకు పది రూపాయలు ఇస్తాను." ఠక్కున జవాబు చెప్పిందా పిల్ల.